Website: www.adugunews.com

సమగ్ర తెలుగు దినపత్రిక

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | బుధవారం 19 ఆగస్టు 2026 | సంపుటి: 02 | సంచిక: 172 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## హర్మూజ్ మాదే!

**'ట్రూత్'లో ట్రంప్ పోస్టు**

**యుద్ధంలో గెలిచింది మేమే**

**ట్రంప్ భ్రమ : ఇరాన్ ప్రకటన**

**జలసంధిని తెరిచే ప్రసక్తే లేదు**

న్యూఢిల్లీ,ఆగస్టు18(అడుగు న్యూస్): ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం గడువు ముగిసిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. అందులో 'అమెరికా కొత్త భూభాగం హర్మూజ్' అని పేర్కొంటూ ఓ మ్యాప్‌ను ఉంచారు. ఆ మ్యాప్‌లో మిగతా 3లో..

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే

**ఏడాదిన్నరపాటు అమలు**

**ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల కోసం ఆంక్షలు**

హైదరాబాద్,ఆగస్టు18(అడుగు న్యూస్): హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. మిగతా 3లో..

# దిమ్మ తిరిగేలా 'దిమాగీ నక్సల్స్'


- ప్రధాని నోట ఇలా.. పార్టీ అలా..
- పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ
- కొత్త ఒరవడికి యువత నాంది!
- అయోమయంలో ప్రధాన పార్టీలు!
- సోషల్ మీడియాలో షేక్ చేస్తున్న వైనం



### నేనూ దిమాగీ నక్సల్ నే!

**ప్రధాని వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్**

న్యూఢిల్లీ,ఆగస్టు18(అడుగు న్యూస్): ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన మిగతా 2లో..




న్యూఢిల్లీ,ఆగస్టు18(అడుగు న్యూస్): కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కారాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాల పై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా మిగతా 2లో..

## పెట్టుబడుల డెస్టినేషన్

**క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం**

**2035నాటికి 26వేల మెగావాట్ల 'సౌర' లక్ష్యం**

**హైటెక్స్ లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్'ను ప్రారంభించిన భట్టి**



హైదరాబాద్,ఆగస్టు18(అడుగు న్యూస్): తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మిగతా 2లో..

### ప్రతి నీటి చుక్కకూ పక్కా లెక్క

**తాగు, సాగునీటికి సర్కార్ భరోసా**

**సమీక్షించిన మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్, ఆగస్టు 18 (అడుగు న్యూస్): ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాలపై అతిగా ఊహించుకోకుండా, అందుబాటులో ఉన్న నీటి నిల్వల ఆధారంగానే శాస్త్రీయంగా జల నిర్వహణ చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జలసౌధలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ప్రజల తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యమిస్తూనే, చేతిలో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలను మిగతా 2లో..

# బాంచెన్ దొర ఇక వద్దు

- ప్రజా ప్రభుత్వంలో సమాన అవకాశాలు
- కేసీఆర్ చేసిన అప్పే తెలంగాణకు పెద్ద ముప్పు
- అబద్ధాలు ప్రచారం చేస్తున్న బావ, బామ్మర్ది
- రాష్ట్రంలో 2029లో మళ్ళీ కాంగ్రెస్ సర్కార్
- శివాజీలాగే పాపన్న గొప్ప పోరాట యోధుడు
- ట్యాంక్ బండ్ పై సర్వాయి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్,ఆగస్టు18(అడుగు న్యూస్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, మిగతా 2లో..

### రేపటి నుంచే సీఎం విదేశాలకు

**29వరకు లండన్, అమెరికాల్లో పర్యటన**

హైదరాబాద్,ఆగస్టు18(అడుగు న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు.

## 'చే'యూతేది?

**మార్గదర్శకాల్లో స్పష్టతేది?**

**కొత్తగా దరఖాస్తు చేసుకోవాలా?**

**పాత దరఖాస్తులకే పరిమితమా?**

**క్లారిటీ కోసం వయోవృద్ధుల ఎదురుచూపు**



హైదరాబాద్,ఆగస్టు18(అడుగు న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నూతన చేయూత పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించి, అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ నిర్ణయం ఏళ్ల తరబడి పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వేలాదిమంది వయోవృద్ధులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఏడు రకాల పింఛన్లకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తుండగా, వృద్ధాప్య పింఛన్లను ఈ జాబితాలో చేర్చకపోవడం తో వృద్ధుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో వృద్ధాప్య పింఛను వయోపరిమితిని తగ్గించినప్పటికీ అనేక మంది అర్హులకు అవకాశం దక్కలేదు. ఆన్‌లైన ఐడీలు ఓపెన్ కాకపోవడంతో వేలాది మంది అర్హులైన వృద్ధులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా తమకు అవకాశం వస్తుందని భావించిన వయోవృద్ధులకు ప్రస్తుతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడంతో వారు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మొదటి విడతగా ఏడు కేటగిరీల వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మిగతా 2లో..

## సారీలతో సరా?

**పొంగులేటి రాజీనామాకు హరీశ్ డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 18 (అడుగు న్యూస్): హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా లక్షల కోట్ల విలువైన ప్రజల ఆస్తులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సెక్షన్ 22(ఏ) నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని మిగతా 2లో..

## ధరణి బాధ్యత హరీశ్ దేనా?

**24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు**

**గజం భూమికి కూడా అన్యాయం జరగదు**


**22ఏ నిషేధిత భూములపై పొంగులేటి**



హైదరాబాద్,ఆగస్టు18(అడుగు న్యూస్): 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే పక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మిగతా 2లో..

## ఏపీలో బీసీలకు 'స్థానిక' రిజర్వేషన్లు పెంపు

- గ్రామాల్లో 34%, పట్టణాల్లో 33.33%
- అక్టోబర్ లోగానే ఏపీలో పుర పోరు
- కేబినెట్ నిర్ణయం అసెంబ్లీలో ప్రకటన
- బీసీల అభ్యున్నతే కూటమి లక్ష్యం
- వైసీపీ 24 శాతానికి కుదించింది
- హర్షాతిరేకాలతో ఎమ్మెల్యేల ఆమోదం
- సీఎం చంద్రబాబుకు సర్వత్రా అభినందనలు



అమరావతి, ఆగస్టు 18 (అడుగు న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన వర్గాల (బీసీల) సామాజిక, రాజకీయ సాధికారతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాతినిధ్యం పెంచేందుకు రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు మిగతా 3లో..

### ఉగ్రవాదం : అనుమానమే ఆయుధం కాకూడదు!?

దేశ భద్రతకు 'ప్రజలు కూడా బాధ్యతాయుతమైన సమాచార భాగస్వాములుగా ఉండాలి. నిఘా సంస్థలు ఆధారాలను విశ్లేషించి, చట్టబద్ధమైన దర్యాప్తు ద్వారా నిందితులను గుర్తించాలి. ఉగ్రవాదంపై కఠిన చర్య అవసరం. అదే సమయంలో నిరపరాధ పౌరుల హక్కులను కాపాడటం కూడా జాతీయ భద్రతలో భాగమే. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అప్రమత్తత మన బలం కావాలి. మతపరమైన అనుమానం మన బలహీనతగా మారకూడదు.

**డా. మార్గం-అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## సంపాదకీయం
## మార్గం - అడుగు



### ఉగ్రవాదం : అనుమానమే ఆయుధం కాకూడదు!?

ఉగ్రవాదం దేశ భద్రతకు నిరంతర సవాలే. అయితే దానిని ఎదుర్కొనే క్రమంలో ప్రతి ముస్లింనీ అనుమానితుడిగా చూడటం, మతం ఆధారంగా వ్యక్తుల కదలికలను పర్యవేక్షించాలనే పిలుపునివ్వడం సమస్యకు పరిష్కారం కాదు. ఉగ్రవాదాన్ని దాని సిద్ధాంతం, సంస్థాగత నెట్‌వర్క్, ఆర్థిక వనరులు, ఆయుధ సరఫరా, సాంకేతిక వ్యవస్థల ఆధారంగా గుర్తించి అణచివేయడమే సమర్థవంతమైన మార్గం.

2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఈ ముప్పును మరోసారి గుర్తుచేసింది. అయితే ఈ ఘటనకు సంబంధించి వివిధ దశల్లో మరణాల సంఖ్యపై భిన్నమైన సమాచారం వెలువడింది. జాతీయ దర్యాప్తు (ఎన్ఐఏ)సంస్థ 2026 మేలో దాఖలు చేసిన 7,500 పేజీల ఛార్జ్ షీట్‌లో ఈ పేలుడులో 11 మంది మరణించినట్లు పేర్కొంది. దర్యాప్తు ప్రకారం ప్రధాన నిందితుడితో సహా 10 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. వారిని అల్‌ఖైదా ఇన్ ద ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఎఐక్యూఐఎస్)అనుబంధ సంస్థ అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్‌తో అనుసంధానించినట్లు ఎన్ఐఏ తెలిపింది. తాజాగా ఐక్యరాజ్యసమితి భద్రతామండలి పర్యవేక్షణ వ్యవస్థ నివేదికలోనూ ఎఐక్యూఐఎస్ కు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.

ఇది భద్రతా సంస్థలకు ఒక స్పష్టమైన హెచ్చరిక. ఉగ్రవాద సంస్థలు సరిహద్దులు దాటి నెట్‌వర్క్ లను నిర్మించుకోవడం, స్థానికంగా వ్యక్తులను ఆకర్షించడం, ఆన్‌లైన్‌లో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం వంటి పద్ధతులను అవలంబిస్తున్నాయి. అందుకే కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థల మధ్య సమాచార మార్పిడి, ఆర్థిక లావాదేవీల పర్యవేక్షణ, సైబర్ నిఘా, సరిహద్దు భద్రత, ఫోరెన్సిక్ సామర్థ్యాల పెంపు, సమన్వయం అత్యవసరం.

గణాంకాలు కూడా అప్రమత్తత అవసరాన్ని చెబుతున్నాయి. సౌత్ ఏషియా టెర్రరిజం పోర్టల్ గణాంకాల ప్రకారం భారత్‌లో ఉగ్రవాద సంబంధిత ఘటనలు 2010లో 3,575 ఉండగా, 2024లో 1,588కి తగ్గాయి. అయితే 2025లో అవి మళ్లీ 2,247కి పెరిగాయి. 2025లో ఉగ్రవాద సంబంధిత హింసలో 657 మంది మరణించినట్లు అదే డేటాబేస్ పేర్కొంటోంది. ఇవి వార్తా నివేదికల ఆధారంగా రూపొందించిన ప్రొవిజనల్ గణాంకాలు అయినప్పటికీ, ముప్పు పూర్తిగా తొలగిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి.

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిస్పందనగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సైనిక చర్యతో పాటు దీర్ఘకాలిక నిఘా, దౌత్యపరమైన ఒత్తిడి, ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేయడం వంటి చర్యలు కూడా కొనసాగాలి.

పాకిస్తాన్‌లో హిందువుల జనాభాపై కూడా వాస్తవ గణాంకాలతోనే మాట్లాడాలి. 'విభజన సమయంలో 30%, ఇప్పుడు 3%' అనే వాదన సూటిగా సరిపోదు. పాకిస్తాన్ అధికారిక 2023 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 1.61%, షెడ్యూల్డ్ కాస్టులు 0.56 శాతం నమోదయ్యారు. రెండింటినీ కలిపి చూసినప్పుడు ఈ సంఖ్య 2 శాతానికి పైగా ఉంటుంది. 2017లో హిందువులు 1.73%, షెడ్యూల్డ్ కాస్టులు 0.41 శాతంగా నమోదయ్యారు.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఉంది. ఉగ్రవాదాన్ని ఇస్లాం మతంతో సమానం చేయడం ప్రమాదకరమైన సరళీకరణ. అల్‌ఖైదా, ఐఎస్, లష్కరే తోయిబా వంటి సంస్థలు మతాన్ని తమ హింసాత్మక రాజకీయ లక్ష్యాలకు ఉపయోగించుకుంటున్నాయి. వారి నేరాలకు బాధ్యత ఆయా ఉగ్రవాద సంస్థలు, వాటికి సహకరించే వ్యక్తులు, నెట్‌వర్క్‌లు, ప్రోత్సాహకులదే తప్ప మొత్తం ముస్లిం సమాజానిదికాదు.

ప్రజల అప్రమత్తతే అవసరం. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, మార్కెట్లు, పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు వంటి రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద వస్తువు కనిపిస్తే తాకకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. హింసకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు, బెదిరింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు అధికారిక మార్గాల్లో నివేదించాలి. కానీ ఒక వ్యక్తి మతం, దుస్తులు, పేరు, భాష లేదా ప్రాంతం ఆధారంగా అతడిని అనుమానించడం మాత్రం సామాజిక ఉద్రిక్తతలకు దారి తీస్తుంది.

దేశ భద్రతకు 'ప్రజలు కూడా బాధ్యతాయుతమైన సమాచార భాగస్వాములుగా ఉండాలి. నిఘా సంస్థలు ఆధారాలను విశ్లేషించి, చట్టబద్ధమైన దర్యాప్తు ద్వారా నిందితులను గుర్తించాలి. ఉగ్రవాదంపై కఠిన చర్య అవసరం. అదే సమయంలో నిరపరాధ పౌరుల హక్కులను కాపాడటం కూడా జాతీయ భద్రతలో భాగమే. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అప్రమత్తత మన బలం కావాలి. మతపరమైన అనుమానం మన బలహీనతగా మారకూడదు.



# బాంచెన్ దొర ఇక వద్దు

మొదటిపేజీ తరువాయి..

సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు



తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పెట్టుబడుల డెస్టినేషన్

మొదటిపేజీ తరువాయి..

ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవడానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఏఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు ఎస్-ఐ-పాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

## ప్రతి నీటి చుక్కకూ పక్కా లెక్క

మొదటిపేజీ తరువాయి..

గరిష్ఠంగా కాపాడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో 76.63%, గోదావరిలో 68.1% నిల్వలు ఉన్నప్పటికీ, స్థూల నిల్వలను కాకుండా వాస్తవంగా ఉపయోగించగల 'లైవ్ స్టోరేజ్' ఆధారంగానే సాగునీటి విడుదల నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సింగూరు డ్యామ్ మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎస్ఎల్‌బీసీ (నాదీజ) సొరంగం పనులను వేగవంతం చేయాలని, పోలవరం ముంపు ప్రభావంపై ఐఐటీ నిపుణులతో సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ఈ కీలక సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఓ అండ్ ఎం, క్వాలిటీ కంట్రోల్) ఆర్. మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ధరణి బాధ్యత హరీశ్ దేనా?

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.



# 'చే'యూతేది?

మొదటిపేజీ తరువాయి..

వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఫైలేరియా, తలసేమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు మాత్రమే ప్రాధాన్యం కల్పించారు. కొత్త పింఛన్ల దరఖాస్తుకు రకరకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో జిల్లాల్లోని తహసీల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛను రూ.4016, వితంతు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ.2016 ప్రతినెలా అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులకు అవకాశం కల్పించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ ఆ దరఖాస్తుదారులకు నేరుగా పింఛన్ ఇస్తారా లేక మళ్లీ కొత్తగా అప్లై చేసుకోవాలా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. అర్హులైన వారు ఈనెల 31లోపు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు లేదా వార్డు ఆఫీసర్లకు తమ దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

# సారీలతో సరా?

మొదటిపేజీ తరువాయి..

బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా ఉంటున్న కాలనీలు, గతంలో ప్రభుత్వమే విక్రయించిన భూములను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి నెట్టడం వల్ల ప్రజలు రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక, రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్, సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ఈ అనాలోచిత నిర్ణయానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ సరిగ్గా పనిచేయడం లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ భవన్ ('జనతా గ్యారేజ్') ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. 22(ఏ) జాబితా వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, అసెంబ్లీలోనైనా ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీసి బాధితుల తరఫున పోరాడతామని బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చారు.

## నేనూ దిమాగీ నక్సల్ నే!

మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.



# దిమ్మ తిరిగేలా 'దిమాగీ నక్సల్స్'

మొదటిపేజీ తరువాయి..

తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్తామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకుఏ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## పర్వతాలు కుటుంబానికి పరామర్శ

నాగర్ కర్నూల్, ఆగస్టు 18 (అడుగు న్యూస్): తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ కావలి పర్వతాలు ఆదివారం కన్నుమూసిన విషయం





తెలుసుకున్న నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి మంగళవారం వారి నివాసానికి వెళ్ళి వారి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం పర్వతాలు భార్య పద్మమ్మ, కుమార్తె అనిత, కుమారుడు (నాగర్‌కర్నూల్ నియోజకవర్గ యువ నాయకుడు) విజయ్ కుమార్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ తీరని కష్ట సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలిగిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కల్పన – భాస్కర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బాబురావులతో పాటు కుటుంబసభ్యులు నరేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలి

మహబూబాబాద్, ఆగస్టు 18 (అడుగు న్యూస్): తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర తప్పిదం చేసిందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బాణోతు శంకర్ నాయక్ మండిపడ్డారు. ప్రజల మనోభావాలను గౌరవించి, రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వీస ఫరీద్, టౌన్ యూత్ ప్రెసిడెంట్ మురళీధర్ రెడ్డి, కౌన్సిలర్ నరేష్, మాజీ సర్పంచులు గూగులోత్ బిక్కు నాయక్, బానోత్ దాము నాయక్, యకయ్య, సుధాకర్, నరేష్, యూత్ నాయకులు నవీన్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు ఘన సన్మానం

మద్దిరాల, ఆగస్టు 18 (అడుగు న్యూస్): సూర్యాపేట జిల్లా, మద్దిరాల తహసీల్దార్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న తహసీల్దార్ తబితను స్థానిక సర్పంచ్ రాంపాక నాగరాజు శాలువాతో



ఘనంగా సన్మానించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డాణము మధు, మల్యాల రాంమూర్తి, దామోదర్, కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రికి రాత్రే పెద్ది విగ్రహం తొలగింపు..

### నర్సంపేట బంద్‌కు బిఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్/వరంగల్, ఆగస్టు 18 (అడుగు న్యూస్): నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రాత్రికి రాత్రే తొలగించారని



బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బుధవారం నర్సంపేట బంద్‌కు పిలుపునిచ్చారు. విగ్రహ ఏర్పాటుపై కలెక్టర్, సీపీకి ముందుగానే సమాచారం ఇచ్చామని, భూ యజమాని విద్యాసాగర్ అనుమతితోనే విగ్రహాన్ని ఏర్పాటు చేశామని మాజీ స్పీకర్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి తెలిపారు. విగ్రహాన్ని తొలగించిన చోటే తిరిగి ఏర్పాటు చేయాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పెద్ది విగ్రహాన్ని తొలగించినా ప్రజల మనసుల్లో ఆయన స్థానాన్ని తొలగించలేరన్నారు. మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మా రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, నన్నపునేని నరేందర్ కూడా విగ్రహాన్ని తక్షణమే పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. నర్సంపేట అభివృద్ధికి పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలను నేతలు గుర్తుచేశారు. మెడికల్ కాలేజీకి ఆయన పేరు పెట్టాలని సిరికొండ మధుసూదన చారి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పెద్ది విగ్రహాలను ఏర్పాటు చేస్తామని వారు ప్రకటించారు. బంద్‌కు ప్రజలు సహకరించాలని ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు.

# ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు!

దేవరుప్పుల, ఆగస్టు 18 (అడుగు న్యూస్): టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను పాలకుర్తి నియోజకవర్గవ్యాప్తంగా పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, తొర్రూరు, పెద్ద వంగర, రాయపర్తి మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు. పాలకుర్తి మండల కేంద్రంలో సీనియర్ నేత అబ్బాస్ అలీ, జనగామ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మదార్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఝాన్సీరెడ్డి ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రార్థించారు. దేవరుప్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పార్టీ, యువజన నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పాలకుర్తి కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఝాన్సీరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు కొనియాడారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు,








బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, జిల్లా, మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే

మొదటిపేజీ తరువాయి..

కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఏపీలో బీసీలకు 'స్థానిక' రిజర్వేషన్లు పెంపు

మొదటిపేజీ తరువాయి..

తీసుకుందని అసెంబ్లీ వేదికగా ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీనితో పాటు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో



సుస్థిర పాలన అందించేందుకు మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, రాష్ట్రంలో జిల్లాల సంఖ్యకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

రాష్ట్ర జనాభాలో బీసీలు 50.54 శాతంగా ఉన్నారని, వారికి చట్టసభలు, స్థానిక సంస్థల్లో సముచిత స్థానం కల్పించడమే తమ విధానమని సీఎం పేర్కొన్నారు. "34 శాతం రిజర్వేషన్ అంటే కేవలం ఒక అంకె కాదు, అది బీసీలకు నిర్ణయాధికారంలో దక్కే నిజమైన భాగస్వామ్యం" అని ఆయన వ్యాఖ్యానించారు. గత చరిత్రను గుర్తుచేస్తూ, 1986లో దివంగత ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో తొలిసారిగా బీసీలకు 20 శాతం కోటా అమలు చేశారని, ఆ తర్వాత 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దానిని 34 శాతానికి పెంచానని తెలిపారు. 1995 నుంచి 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లోనూ ఇదే 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయని గుర్తుచేశారు.

అయితే, గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి దాదాపు 16,800 మంది బీసీల రాజకీయ అవకాశాలను దెబ్బతీసిందని చంద్రబాబు విమర్శించారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా వాటికి కనీస వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు తిరిగి 34 శాతం కోటాను అమలు చేస్తోందని, దీనిని అడ్డుకోవడానికి ఎవరైనా కోర్టులకు వెళ్తే ప్రజల దృష్టిలో చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో నిర్వహిస్తేనే కేంద్ర 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు సుమారు రూ.3,862 కోట్ల గ్రాంట్లు అందుతాయని వివరించారు.

సమాజంలో చిట్టచివరి వ్యక్తిని ముందుకు తీసుకురావడమే అసలైన అభివృద్ధి అని చంద్రబాబు స్పష్టం చేశారు. బీసీ నేతలకు గుర్తింపునిచ్చి ప్రోత్సహించిన ఘనత టీడీపీకే దక్కుతుందని, పార్టీ ఆవిర్భావం నుంచే అనేకమంది బీసీ నాయకులు ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ చరిత్రలో తొలిసారిగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించామని, వారికి మైనింగ్ లీజుల్లో 10 శాతం కేటాయింపుతో పాటు సబ్సిడీలు కూడా అందిస్తున్నామని తెలిపారు. బీసీలకు చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా న్యాయం జరిగే వరకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సభలోని ఎమ్మెల్యేలు, మంత్రులు స్టాండింగ్ ఒవేషన్‌తో సీఎం నిర్ణయాన్ని స్వాగతించి అభినందనలు తెలిపారు.

# పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం

హైదరాబాద్,ఆగస్ట్18(అడుగు న్యూస్): తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చిందని.. ఆ తర్వాత ఆపేసిందని అన్నారు.




## స్టార్ హోటల్ల దోశ గిట్లనే తినాల్నట!?

శిన్నప్పుడు మనం ఎట్ల తినాల్నో? ఎట్ల తినకూడదో మన అవ్వయ్యలు నేర్పిత్తురు. అన్నలక్కలు కూడా శెప్తరు. గట్లనే మనం తినడం నేర్సుకుంటం. పెద్దగైనంక సుత.. గట్ల తినుడే అలవాటు శేసుకుంటం.

కనీ, పెద్ద పెద్ద స్టార్ హోటల్లు, పంక్షన్లల్ల తినడం కూడా ఓ స్టేటస్ సింబల్. గట్లనే గా స్టార్ హోటల్లల్ల శేత తింటే తక్కువ సూత్తరట. మరెట్ల తినాల్నంటే.. శెంషె గదేనుల్లా స్పూన్ తోటే తినాల్నట. ఓ శేత ఫోర్కు, మరో శేత శెంషె పట్టుకుని గా దోశను



మూడు భాగాలుగా, ఒక్కదగ్గరికె ఒత్తిండు. గా ఫోర్కు, శెంషెతోటి శిన్న శిన్న ముక్కలు శేసి తినాల్నని సూపిండు. గదాన్ని గూడా ఈడియ తీసిండ్రు. 'పదిహేను వందల రూపాలు పెట్టి స్టార్ హోటల్ల దోశ ఆర్డరేసినా, గదాన్ని స్పూన్ తోనే తినాలె' అని పైన రాసి, గదాన్నిప్పుడు నెట్టింట్ల పెట్టిండ్రు. ఇగ గా ఈడియను నెటిజన్లు తెగ సూత్తాండ్రు. 'గిట్ల గూడా తినొచ్చా భయ్యా? అని ఒకాయినె, 'సూడ్డానికి నవ్వొస్తున్నా, గిట్ల గీ శెంషెలతోటి దోశ తినుడు తిప్పలే' నని ఇంకాయినె. 'ఎహె తియ్.. మన వంటల్ని మన లెక్కనే తినాలె' అని మరొకాయినె కామెంట్లు శేసిండ్రు. మరి మీరేమంటరు.!?

## కేసముద్రంలో పెద్దపులి కలకలం

కేసముద్రం, ఆగస్టు 18 (అడుగు న్యూస్): మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, అర్పణపల్లి పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోందన్న వార్త తీవ్ర కలకలం రేపుతోంది. అర్పణపల్లికి చెందిన రైతు గండికోట కుమార్ సాయంత్రం పొలానికి వెళ్లగా, సమీపంలోని పొదల్లో పెద్దపులిని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు. భయంతో గ్రామానికి చేరుకుని సమాచారం అందించడంతో స్థానికులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రదేశంలో కనిపించిన అడుగుజాడలు పులి పాదముద్రలేనని గ్రామస్థులు భావిస్తున్నారు. ఈ ఘటనతో అర్పణపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాదముద్రలను నిర్ధారించాలని, పులిని బంధించి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## కలర్ ప్రింటర్ బహూకరణ

పాలకుర్తి, ఆగస్టు 18 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పచిక విజయ్ కుమార్ తన సతీమణి నీలిమ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు



₹15,000 విలువైన కలర్ ప్రింటర్‌ను బహూకరించారు. ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎం చిదురాల శ్రీనివాస్ సమక్షంలో ప్రింటర్‌ను అందజేసి, విద్యార్థులకు అరటిపళ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడి దాతృత్వాన్ని అధికారులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

# హర్మూజ్ మాదే!

మొదటిపేజీ తరువాయి..

హర్మూజ్ జలసంధిని ఓ రౌండ్‌తో మార్క్ చేసినట్టు ఉంది. హర్మూజ్ జలసంధిపై పూర్తిగా నియంత్రణ తమకే ఉందని ట్రంప్ ఇన్నాళ్లూ వాదిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్ యూఎస్ మధ్య అవగాహన ఒప్పందాన్ని మళ్లీ పొడిగించడానికి ప్రయత్నిస్తున్నారా? అని ఓ సమావేశంలో విలేకరులు ప్రశ్నించగా, ట్రంప్ తల అడ్డంగా ఊపారు. ప్రస్తుతం ఇరాన్‌తో ఎలాంటి చర్చలు జరగడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా నౌకాదళం దిగ్బంధనం పూర్తి స్థాయిలో కొనసాగుతోందని అన్నారు. "హర్మూజ్ ప్రస్తుతం తెరిచే ఉంది. అది పనిచేస్తోంది. ఆ జలమార్గంలోని వాటర్ మైన్స్‌ను తొలగించడం లేదా పేల్చివేయడం జరిగింది. ఈ చర్యల వల్ల ప్రస్తుతం చమురు ధరలు తగ్గుతున్నాయి. ఇక ముందు కూడా తగ్గుతూనే ఉంటాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణుకార్యక్రమాన్ని సాగనీయమని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. "వారిని అణ్వాయుధాలు తయారు చేయనివ్వం. గతంలో మేము బి-2 బాంబర్లతో దాడి చేశాం. ఈ దెబ్బతో ఒక వేళ వారు అణ్వాయుధాలు తయారు చేయాలనుకున్నా దానికి చాలా సమయం పడుతుంది" అని ట్రంప్ అన్నారు. మరోవైపు తమ డిమాండ్లు నెరవేర్చే వరకు హర్మూజ్ జలసంధిపై తమ పట్టును కొనసాగిస్తామని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ మంగళవారం స్పష్టం చేశారు. "ఒప్పందం ప్రకారం అమెరికా హర్మూజ్ దిగ్బంధనాన్ని ఎత్తేయాలి. స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను వెంటనే విడుదల చేయాలి. ఇరాన్ చమురుపై ఆంక్షలను తొలగించాలి. అమెరికా సైనిక చర్యలకు ముగింపు పలకాలి. అప్పటివరకు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేది లేదు" అని బాఘేర్ గాలిబాఫ్ స్పష్టంచేశారు. ఇంతకు ముందు హర్మూజ్ జలసంధి నియంత్రణ విషయంలో ఇరాన్‌తో కలిసి అడుగులు వేయవద్దని ఒమన్‌ను ట్రంప్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. అమెరికా వైఖరికి విరుద్ధంగా ఒమన్ మధ్యలో జోక్యం చేసుకుంటే 'వారిపై బాంబుల వర్షం కురిపించి నాశనం చేస్తాం' అని తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. ఫాక్స్ న్యూస్ ప్రతినిధితో జరిగిన ఫోన్ కాల్‌లో ట్రంప్- పశ్చిమాసియా ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడారు. జూన్‌లో కుదిరిన 60 రోజుల అవగాహన ఒప్పందం (వీశీఖ) గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

# ఆటలు

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



# భారత్ విజయం లాంఛనమే!!

**భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్**

**372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన**

**గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్**

**శ్రీలంక విజయానికి 288 పరుగులు**

**గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట**



శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు.

అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రబాత్ జయసూర్య(3/43) మూడు వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

## శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.



## గాయత్రీ , శ్రీకాంత్ లకు అర్జున అవార్డు..

### మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్,



బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. అర్జున అవార్డు గ్రహీతల జాబితాలో నిలిచారు. 1962 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత ఫుట్‌బాల్ టీమ్ సభ్యుడు ఐ. అరుమై నాయగం కు లైఫ్‌టైమ్ కేటగిరీలో అర్జున అవార్డు దక్కింది. కోచ్ లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డుల రెగ్యులర్ కేటగిరీలో అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్ ఎంపికయ్యారు. లైఫ్‌టైమ్ కేటగిరీలో బాక్సింగ్ కోచ్ ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్ కోచ్ వీరేందర్ కుమార్ లకు ద్రోణాచార్య దక్కింది. క్రీడల ప్రోత్సాహానికి కృషి చేసిన కార్పొరేట్, ఎన్జీవో విభాగంలో అందించే రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం పూణేకు చెందిన ఆర్మీ పారాలింపిక్ నోడ్ కు లభించింది. ఖేల్ రత్న అవార్డు లేకపోవడం మినహా మిగతా విభాగాల్లో పెద్ద సంఖ్యలోనే భారతీయ క్రీడాకారులకు గుర్తింపు లభించింది.

# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..





## ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

**రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్**

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

## డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ







అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

## అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మ్లలెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.




## సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005